# పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు

బంట్వారం: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో ప్యాడ్స్, హాల్ టికెట్ల పంపిణీ

బషీరాబాద్, మార్చి 19 : రేపటి నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బషీరాబాద్ ఎంఈవో రాములు బుధవారం తెలిపారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో, తెలంగాణ మెడల్ స్కూల్‌లో పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రానికి ఉదయం 9 గంటలకు వరకు చేరుకోవాలని స్పష్టం చేశారు. మండలంలోని 11 హైస్కూల్స్, ఒక కేజీబీవీ, ఒక తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన 424 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. అందులో 209 మంది బాలికలు, 215 బాలురులు ఉన్నట్లు తెలిపారు. ఇందులో ఇంగ్లీష్ మీడియం 264, తెలుగు మీడియం 157, ఉర్దూ మీడియం 3 ఉన్నట్లు వివరించారు.

**బొంరాస్‌పేట్:** బొంరాస్‌పేట్, దుద్యాల్ మండలాల్లో చదువుతున్న విద్యార్థులకు బొంరాస్‌పేట్‌లో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. హకీంపేట్, దుద్యాల్, రేగడిమైలారం, చౌదర్‌పల్లి, బోట్లోనితాండ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు మొత్తం 486 మంది హాజరుకానున్నారు. ఈ మేరకు విద్యార్థులకు హల్‌టికెట్స్‌ను ఉపాధ్యాయులు అందజేసినట్లు మండల విద్యాధికారి హరిలాల్ తెలిపారు.

**యాలాల:** పదోతరగతి పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు యాలాల మండల విద్యాధికారి రమేశ్ బుధవారం తెలిపారు. మండల పరిధిలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్షా కేంద్రాలయిన జడ్పీహెచ్ఎస్ అగ్గనూరులో 200, జెడ్పీహెచ్ఎస్ యాలాల బాయ్స్‌లో 199, గౌతమీ హైస్కూల్‌లో 150, ప్రతిభ హైస్కూల్‌లో 142 మంది విద్యార్థులతో కలిపి మొత్తం 691 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు.

**బంట్వారం:** మండల కేంద్రంలో జడ్పీహెచ్ఎస్‌లో బుధవారం పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్స్, హాల్ టికెట్‌లను ఎంపీడీవో డ్యానియల్ పంపిణి చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు పదో తరగతి తొలి మెట్టు లాంటిదని, ఇందులో మంచి విజయం సాధించాలన్నారు. పది తరువాత విద్యార్థుల అభిరుచి మేరకు వివిధ రంగాలలో పై చదువులకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈవో చంద్రప్ప పాల్గొన్నారు

## పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలి

కొడంగల్, మార్చి19 : కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌తో కలిసి పాత కొడంగల్‌లోని ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయలన్నారు.ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలకు మంచి గుర్తింపును తీసుకురావలని శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి బియ్యం, కూరగాయాలు, ఇతర వస్తువులను పరిశీలించి నిల్వ ఉంచే ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని అయన సిబ్బందికి సూచించారు.

## వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

కులకచర్ల, ఫిబ్రవరి 19 : పదవ తరగతిలో కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థులు మంచి మార్కులు సాధించి వంద శాతం ఉత్తీర్ణత పొందాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్‌నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులకు పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంఈవో అబీబ్‌హైమద్, పాఠశాల ఎస్‌వో దేవి, గిరిజన విద్యార్థుల సంఘం మండల మండల ప్రధాన కార్యదర్శి గణేశ్‌నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత..కేసు నమోదు

కులకచర్ల, మార్చి 19 :మండల పరిధిలోని ఇప్పాయిపల్లి గ్రామం నుంచి అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న కులకచర్ల పోలీసులు అక్కడకు వెళ్లి ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఇప్పాయిపల్లి గ్రామం నుంచి రేషన్ బియ్యాన్ని కులకచర్లకు తరలించేందుకు ఆటోలో నింపిగా పోలీసులు ఆటోను స్వాధీనం చేసుకుని కులకచర్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన సంగయ్య అనే వ్యక్తి ఆరు కింటాళ్ల రేషన్ బియ్యంను తరలిస్తూ పట్టుబడ్డాడు. అక్రమంగా రేషన్ బియ్యం సరఫరా చేసే వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అన్వేశ్‌రెడ్డి అన్నారు.

ధారూరు, మార్చి 19: భూగర్భజలాలు తగ్గడంతో ఎత్తు ప్రదేశంలో ఉన్న పంటలు ఎండు ముఖం పడుతున్నాయని ధారూరు వ్యవసాయ విస్తరణ అధికారి సంజీవ్ రాథోడ్ తెలిపారు. బుధవారం ఉన్నతాధికారుల ఆదేశాను సారం మండల పరిధిలోని పులిచింతల మడుగు తండా లో ఎండుముఖం పడుతున్న పంటపొలాలను రైతులతో కలిసి క్షేత్ర పరిశీలన చేశారు. రైతు పొలంలో ఉన్న బోరుమోటారును, సాగుచేసుకున్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి సంజీవ్ రాథోడ్ మాట్లాడుతూ భూగర్భజలాలు తగ్గడంతో పంటలు ఎండుతున్నాయని, రైతు పొలంలో బోర్ మోటారు రనింగ్‌లో ఉన్న నీరు మాత్రం చాలా తక్కువగా వస్తున్నాయన్నారు. .

## ఇంటి పన్ను వందశాతం వసూలు పూర్తిచేయాలి

కొడంగల్, మార్చి19 : పంచాయతీ కార్యదర్శులు కొడంగల్ మండల వ్యాప్తంగా 100శాతం ఇంటి పన్ను వసూలు లక్ష్యంతో పూర్తిచేయాలని మండల పంచాయతీ అధికారులు అన్నారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 85% ఇంటి పన్ను వసూలు అయ్యాయి, హుస్సేన్ పూర్, ఖాజాహమ్మద్‌పల్లి గ్రామపంచాయతీలలో 100% పూర్తి చేయడం జరిగిందన్నారు.మిగిలిన గ్రామాలలో మార్చి 31వ తేదీ నాటికి నిర్దేశించిన లక్ష్యన్ని పూర్తిచేయాలని అన్నారు.

# కళ్లెదుటే ఎండిపోతున్న పంట

**రూ.3లక్షలు ఖర్చు చేసి మూడు బోర్లు వేసినా దక్కని ఫలితం**

నెర్రెలు వారిన పొలాన్ని చూస్తున్న రైతు బాల్‌రెడ్డి

పరిగి, మార్చి 19: బోర్లలో రోజు రోజుకు తగ్గిపోతున్న నీటి మట్టం, కొత్తగా బోర్లు వేసినా రాని నీరు, ఇప్పటికే ఎండిన వరి, మరికొద్ది రోజులలో మిగతా వరి పంట పూర్తిగా ఎండిపోతుందన్న దిగులుతో రైతన్న కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఓవైపు పంట ఎండిపోతుండడం, మరోవైపు పెట్టిన పెట్టుబడి సైతం చేతికి అందేలా లేదనే ఆందోళన ఆ రైతు కుటుంబాన్ని మరింత కృంగదీస్తుంది. వివరాల్లోకి వెళ్తే పరిగి మండలం రంగంపల్లి గ్రామానికి చెందిన రైతు బాల్‌రెడ్డికి 13 ఎకరాల భూమి ఉంటుంది. ఆయన కుమారులు ఇద్దరు చంద్రశేఖర్ రెడ్డి, దశరథరెడ్డిలు ఈ పొలంలో పంటల సాగు చేపడుతున్నారు. గత కొన్నేళ్లుగా చక్కటి వ్యవసాయంతో వరి సాగు చేస్తున్నాడు. ఈసారి యాసంగిలోను వరి పంటను సాగు చేస్తున్నారు. నాలుగు బోర్లు ఉండగా వాటి కింద వరి పంట సాగను చేపట్టారు. ఒక ఎకరా వరి పంట సాగు కోసం గరిష్టంగా రూ.40వేలు ఖర్చు చేశారు. ఈ లెక్కన 13 ఎకరాలలో వరి పంట సాగుకు సుమారు రూ.4లక్షలకు పైగానే ఖర్చయింది. అందరిలాగే సమయానుకూలంగా నాట్లు వేయించడం, కలుపు తీయడం, ఎరువులు వేయడం చేపట్టినా, అంతా బాగుందనుకున్న తరుణంలో గత 20 రోజుల నుంచి ఒక్కసారిగా బోర్లలో నీరు తగ్గడం ప్రారంభమైంది. రోజు రోజుకు బోర్లలో నీరు తగ్గుతున్న కొలది రైతు కుటుంబంలో ఆందోళన పెరిగిపోయింది. మరో నెల రోజులైతే పంట చేతికి వస్తుందనుకున్న తరుణంలో పంటకు సరిపడ నీరు బోర్ల నుంచి రావడం లేదు. దీంతో వరి పంటకు నీరు సరిపడ అందక పొలం నెర్రెలు వారడం ప్రారంభమైంది. నీరు పారడం తగ్గిపోయి ఇప్పటికే 3 ఎకరాలలో వరి పంట ఎండిపోయింది. ఎలాగైనా మిగతా పంటను కాపాడుకుందామనే ఆలోచనతో రైతు ఒకటి కాదు రెండు కాదు ఏకంగా మూడు బోర్లు వేయించినా ఫలితం లేకుండాపోయింది. ఒకటి 515 ఫీట్లు, రెండవతది 150 ఫీట్లు, మూడవది 750 ఫీట్లు లోతు వరకు బోర్లు వేయించినట్లు రైతు తెలిపారు. మూడు బోర్లు వేయించేందుకు సుమారు రూ.3లక్షల వరకు ఖర్చు చేసినట్లు రైతు కుటుంబసభ్యులు తెలిపారు. వరి పంట ఎండుతుండడం చూసి పక్క పొలం వారిని పంట కోసం నీరు ఇవ్వాలని అడుగగా మొదట ఇస్తామని చెప్పి, తమ బోర్లలోనే నీరు తగ్గుతున్నాయని పేర్కొంటున్నట్లు సమాచారం. ఇదే పరిస్థితి కొనసాగి, పక్క పొలం వారు నీరు ఇవ్వకుంటే మరికొద్ది రోజులలో మిగతా పంట సైతం పూర్తిగా ఎండిపోయే ప్రమాదముందని రైతు కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. నీరందక మిగతా పంట ఎండిపోతే లక్షలలో నష్టం చేకూరుతుందని వాపోతున్నారు.

**లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణంపై**

## ప్రభుత్వం చర్యలు

పరిగి, మార్చి 19: లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు ఏర్పాటుచేసి, పనులు సత్వరమే ప్రారంభిస్తామని బడ్జెట్ ప్రసంగంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలోనే ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభ మవుతాయని ఆయన పేర్కొన్నారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణం కోసం పలు సంద ర్భాలలో సమావేశాలు నిర్వహించడం జరిగిందని, పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకు విన్నవించామన్నారు. ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రసంగంలో పేర్కొనడంతో తనకు చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా రైతాంగానికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

## పరిగి ఆర్టీసీ డిపో మేనేజర్‌గా సుఖేందర్‌రెడ్డి

పరిగి, మార్చి 19: పరిగి ఆర్టీసీ డిపో మేనేజర్‌గా సుఖేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం సిద్దిపేట్ డిపో మేనేజర్‌గా పనిచేస్తూ పరిగి డిపో మేనేజర్‌గా బదిలీ అయ్యారు. పరిగిలో పనిచేస్తున్న డిపో మేనేజర్ కరుణశ్రీ కామారెడ్డి డిపో మేనేజర్‌గా బదిలీ అయ్యారు. సుఖేందర్ రెడ్డి పరిగి డిపో మేనేజర్‌గా శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పెద్దేముల్, మార్చి 19: పెద్దేముల్ మండల పరిధిలోని హన్మాపూర్ గ్రామంలో బక్కని వెంకటేశ్ (33) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన బుధవారం తెల్లవారు జామున జరిగింది. ఈ సంఘటనకు సంబందించి పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బక్కని వెంకటేశ్‌కు అదే గ్రామానికి చెందిన సబితాతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం లావణ్య (13), కిషోర్ (8). వెంకటేష్ తల్లి లక్ష్మమ్మ వీరితో పాటు కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. వివాహం జరిగిన నాలుగైదు సంవత్సరాల తర్వాత వెంకటేశ్ మద్యానికి బానిసయ్యాడు. ప్రతి రోజు ఇంట్లో వాళ్లని హింసించడం అతనికి పరిపాటుగా మారింది. ఈ విషయమై గ్రామంలో పలుమార్లు పంచాయతీలు నిర్వహించి మందలించిన అతని ప్రవర్తనలో మాత్రం మార్పు రాలేదు. మంగళవారం రాత్రి వెంకటేశ్ మద్యం తాగి కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. బుధవారం తెల్లవారు జామున రక్తపు మడుగులో విగత జీవిగా పడి ఉన్నాడు. ఈ విషయమై వెంకటేశ్ తమ్ముడు బక్కని శ్రీనివాస్ తన తల్లి , వదినలు కలిసి మా అన్నను చంపి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ పెద్దేముల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీధర్ రెడ్డి తెలిపారు.

## బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలకు మంగళం

వికారాబాద్, మార్చి 19: బడ్జెట్లో ఆరు గ్యారంటీలు, వందరోజుల హామీలకు కాంగ్రెస్ ప్రభుత్వం మంగళం పాడిందని బీఆర్ఎస్ వికారాబాద్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పడిగళ్ల అశోక్ బుధవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. అంబేద్కర్ అభయ హస్తం పేరుతో దళిత బంధు స్థానంలో 12 లక్షలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ఆ ఊసే ఎత్తలేదన్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమానికి నిధులు కేటాయిస్తామని చెప్పి... ఇప్పుడు బడ్జెట్లో ఆ మాట మరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. వికారాబాద్ అనంతగిరి అభివృద్ధి గురించి మాట లేదని, గతంలో ఏకో టూరిజం చేస్తామని మాటలు ఇచ్చారు కాని నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు.

## అంగన్‌వాడీలో అన్నప్రాసన..

కులకచర్ల, మార్చి 19 : చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాలే పౌష్టికాహారా కేంద్రాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ యాదమ్మ, అంగన్‌వాడీ టీచర్ పండరీబాయి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కామునిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నా రులకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కామునిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి శైలజ, హెచ్ఎం చంద్రయ్య, ఉపాధ్యా యులు రజిత, లలిత, ఆయా కవిత, ఆశ కార్యకర్త బాలమణి, పాఠశాల కమిటీ చైర్మన్ కిష్టమ్మ పాల్గొన్నారు.

## మామిడి యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలి

మామిడి కాయలను పరిశీలిస్తున్న జిల్లా అధికారిణి కమల

వికారాబాద్, మార్చి 19 : ఉష్ణోగ్రతలు పెరుగుతుండటం వలన మామిడి తోటల యజమానులు డ్రిప్పు పైపుల సహాయంతో సాగు చేసుకోవాలని ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి అధికారి యు.కమల తెలిపారు. బుధవారం జిల్లాలోని మామిడి పంటల సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కో చెట్టుకి 6 నుంచి 8 డ్రిపర్లను ఉపయోగించి రోజుకి 3 గంటల పాటు నీళ్లను విడిచిపెట్టాలన్నారు. నీటి పారుదల ఉదయం ఒక గంటన్నర, తిరిగి సాయంత్రం ఒక గంటన్నర ఇచ్చినట్లయితే మట్టిలో తేమశాతం నిలకడగా ఉండి చెట్టు వేసవిలో ఆరోగ్యంగా ఉండడానికి దోహదపడుతుందని తెలిపారు. డ్రిప్పర్లను చెట్టు కాండానికి 1.5 మీటర్ల దూరంలో అమర్చాలన్నారు. పది సంవత్సరాల కంటే ఎక్కువ వయసు ఉన్న మామిడి చెట్లకి 500 గ్రాముల యూరియా, 500 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అందించటం వలన మామిడి కాయలు బాగా వస్తాయని పేర్కొన్నారు. ఫిప్రోనేల్ 2ఎంఎల్ ని ఒక లీటరు నీటిలో కలిపి స్ప్రే చేయడం వలన తామర పురుగుల బెడద నుంచి మామిడి పంటను కాపాడుకోవచ్చని సూచించారు. తేనె మంచు పురుగు నివారణ కొరకు బ్రాఫెజిన్ 1.5 మిలీ. 1 లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. మామిడి పిందె నుంచి నిమ్మకాయ సైజులో ఉన్నపుడు planofix 1 మీ లీ 4.5 లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయడం వల్ల పూత రాలడం నివారించవచ్చని వివరించారు. అధికారుల సలహాలు, సూచనలు పాటించి మామిడి పంట దిగుబడిని పెంచుకోవాలని కోరారు.

# పొంచి ఉన్న ప్రమాదం

ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ ప్రాంగణంలో ప్రమాదంగా ఉన్న బోరుబావి

తాండూరు, మార్చి 19: బోరుబావులు ఎంతో మంది పసి పిల్లల ప్రాణాలు బలి తీసుకున్నాయి. బిడ్డల్ని కోల్పోయిన తల్లిదండ్రులు ఇప్పటికీ మనోవేదన అనుభవిస్తున్నారు. నీళ్ల కోసం తొవ్వి వదిలేయడంతో ఆడుకుంటున్న చిన్నారులు బోరు బావుల్లో పడిపోతున్న సంఘటనలు ఆందోళనకరంగా మారాయి. అడుగుల లోతులో ఊపిరి ఆడక బాధిత చిన్నారులు అనుభవించే నరకం వర్ణనాతీతం. తమ బిడ్డ సజీవంగా బయటకు రావాలని ఆ తల్లిదండ్రులు, బంధుమిత్రులు పడే ఆవేదన చెప్పలేనిది. అందుకు బోరు వేసిన వారు నీళ్లు పడకపోతే వెంటనే పూడ్చకపోవడం, నీళ్లు ఉన్న కూడ మోటర్ బిగించడం అలస్యం చేయడమే ఇందుకు కారణంగా నిలిచాయి. ఇలాంటి నిర్లక్ష్యమే యాలాల మండలం గిరిజపూర్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో చోటు చేసుకుంది. నిత్యం పిల్లలు ఉండే పాఠశాల ఆవరణలోనే బోరుబావి ప్రమాదంగా మారింది. అయితే ఈ బోరుబావికి ఇన్ని రోజులుగా బోరు ఉండేదని, గ్రామంలో మరో చోటుకు ఆ బారులోని మోటర్‌ను తీసుకుపోవడంతో ఇలా ప్రమాదంగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు తెలిపారు. సంబంధిత అధికారులు, నేతలు స్పందించి ప్రమాదంగా మారిన బోరుబావికి వెంటనే మరమ్మత్తులు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. లేదంటే తమ పిల్లల ప్రాణాలకు చాల ప్రమాదకరం అంటున్నారు.

# తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న బాధితులు

పెద్దేముల్, మార్చి 19 : మండల పరిధిలోని ఇందూర్ గ్రామ దళితులకు సంబంధించిన భూమిని విరాసత్ చేయకుండా కాలయాపన చేస్తున్న పెద్దేముల్ తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని కేపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య డిమాండ్ చేశాడు. గ్రామానికి చెందిన సాతంగారి నర్సమ్మ సర్వేనంబర్ 278/8,విస్తీర్ణం 2:10, సాతంగారి నర్సమ్మ సర్వే నంబర్ 278/7 విస్తీర్ణం 2:22 సాతంగారి నౌజప్ప సర్వే నంబర్ 278/6 విస్తీర్ణం 3:01 భూమికి సంబంధించి తమ తల్లిదండ్రుల పేరు మీద ఉన్న భూమిని వీరాసత్ పట్టా మార్పిడి చేయాలని తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కేపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య మాట్లాడుతూ ఇందూర్ గ్రామానికి చెందిన దళిత కుటుంబాలు డివిజన్, జిల్లా ,రాష్ట్ర స్థాయి కార్యాలయాల చుట్టూ తిరిగినాఇప్పటి వరకు విరాసత్ పట్టా మార్పిడి చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న తహసీల్దార్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తహసీల్దార్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

## చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం..

యాలాల, మార్చి19: యాలాల మండలం సంగెం గ్రామానికి చెందిన భానుప్రియ, శివ కుమార్‌ల కొడుకు వశిష్ట (తొమ్మిది నెలలు) అరుదైన కాలేయ వ్యాధి (బైలేరియా అట్రేసై) వ్యాధితో బాధ పడుతున్నాడు. బుధవారం ఆర్‌బీఓఎల్ సీఈఓ శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో యాలాల పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాములు బాధిత కుటుంబానికి రూ.12 వేలు అందించారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తాండూరు రూరల్, మార్చి 19: తాండూరు మండలం, చెన్‌గేష్‌పూర్ గ్రామంలో ఎంఎన్ఆర్ ఈజీఎస్ పథంలో భాగంగా రూ.ఐదు లక్షల విలువైన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రవీణ్‌గౌడ్, కుర్వ మల్లప్ప, గోవింద్ రాజ్‌గౌడ్, తదివతరులు ఉన్నారు.

## విద్యుత్ ఇబ్బందులు తప్పడంలేదు

పూడూరు, మార్చి 19: ఎండకాలంలో సాగు చేస్తున్న జొన్న పంట సాగుకు విద్యుత్ సరఫరా సక్రమంగా అందజేయడం లేదు. పూడూరు మండలం అంగడి చిట్టం పల్లి గ్రామంలో రైతు కె. రవి బావిలో కొంత నీరు ఉండడంతో ఎకరం భూమిని కౌలుకు వేసుకొని జొన్న పంట సాగు చేస్తున్నాను. గత ప్రభుత్వం మాదిరిగా నిరంతరం విద్యుత్ సరఫరా ఉంటుందని కౌలు వేసుకున్న భూమిలో జొన్న పంట సాగు చేస్తున్నాను. కానీ ప్రస్తుత ప్రభుత్వం నిరంతర విద్యుత్ సరఫరా చేయకపోవడంతో పంటకు సకాలంలో నీరు అందించలేకపో తున్నాను. కౌలు డబ్బులతో పాటు జొన్న పంట సాగుకు సుమారుగా ఎకరం భూమికి రూ.30 వేలు ఖర్చు అవుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పంటల సాగుకు నిరంతరం విద్యుత్ అందజేయక పోవడంతో పంటలు ఎండుతున్నాయి. పంట పొలాలకు నీరు అందించేందుకు గాను కరెంట్ అంతరాయంతో రోజంతా నిరీక్షించాల్సి వస్తుంది, కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందజేసిన విధంగా వ్యవసాయ పంటసాగుకు నీరు అందిం చేందుకు గాను విద్యుత్‌ను నిరంతరం సరఫరా చేయాలి. గత రెండేళ్ల క్రితం వ్యవ సాయ సాగుకు విద్యుత్ అంతరాయం ఉండేది కాదు.

–కె.రవి అంగడి చిట్టంపల్లి, పూడూరు మండలం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**DOCUMENT LOST**

I, SEDAPOLLA SHYAM NAGRAJ GOUD, S/o. S.Surender Goud, R/o. 3-1-84, Vinoda Nivas, Yashoda Nagar, Tandur, Vikarabad Dist., hereby inform that I am the absolute owner and possessor of Open Plot No. 22/A in Sy.No. 137/P of Tandur Village, Ward No.3, Block No.1, Yashoda Nagar, Tandur Municipality, Vikarabad District, which is acquired through Regd. Sale Deed vide Doc.No. 2138/2021, the Link Document bearing No. 1545/2007, while travelling to Hyderabad from Tandur RTC Bus Stand on 15-12-2024. Anybody found, Contact: 9848680303

**WANTED**

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073. NT-330663-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**బహిరంగ ప్రకటన**

తేదీ:19-03-2025

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా; నా క్లయింట్ అయిన శ్రీమతి ముడావత్ రుక్మీబాయి భర్త యం.నారాయణసింగ్, నివాసము షాద్‌నగర్ గ్రామము, ఫరూఖ్‌నగర్ మండలము, రంగారెడ్డి జిల్లా గారి తరపున జారీ చేయు బహిరంగ ప్రకటన యేమనగా రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్ నగర్ మండలము, గుండ్లకుంట గ్రామ శివారులోని సర్వే నెం. 1 యందలి ప్లాటునెం. 175, విస్తీర్ణము 122.22 చదరపు గజములలో నూతనముగా నిర్మించిన గృహమును నా క్లయింటు మెసర్స్ వెంకటేశ్వర బిల్డర్స్, రిప్రజెంటెడ్ బై శ్రీ తుమ్మల శ్రీనివాసరావ్ తండ్రి టి. శివరామకృష్ణయ్య గారి నుండి కొనుటకు నిర్ణయించుకొని ఎల్.ఐ.సి. హౌజింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ లోన్ ఖాతా నెం. 70012900019 34 ఆర్రయించినారు. ఇట్టి పై తెలిపిన ఆస్తికి రిజిస్టర్డ్ లింక్ డాక్యుమెంటు నెం. 4444/2001 S.R.O షాద్‌నగర్ ప్రస్తుతము మెసర్స్ వెంకటేశ్వర బిల్డర్స్ వారి ఆధీనములో లేదు. పై కనబరచిన లింక్ డాక్యుమెంటుకు సంబంధించి ఎవరికైనా ఎటువంటి అభ్యంతరాలు, ఆక్షేపణలు, హక్కులు, అధికారములు ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన నాటి నుండి 15 రోజుల లోపు తమ ఆక్షేపణలను క్రింద కనబరిచిన చిరునామాకు తెలుపగలరు. 15 రోజులు దాటిన తర్వాత వచ్చే ఎలాంటి ఆక్షేపణలను పరిగణనలోనికి తీసుకోబడవని ఇట్టి బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

**పై గృహ ఆస్తికి హద్దులు:** తూర్పు: 25 ఫీట్ల వెడల్పు రోడ్డు, పడమర : ప్లాట్‌నెం. 154, ఉత్తరము: ప్లాట్‌నెం. 176, దక్షిణము: ప్లాట్‌నెం. 174.

**GOPAL JHAWAR, Advocate**
**# 30-141, Venkateshwara Colony, Jadcherla-509301, Mahabubnagar Dist.**
**Cell : 9291211196**

**PUBLIC NOTICE**

General Public here by informed that my client entered into an Agreement of sale for the purchase of the schedule property from its owners and possessors 1] Kosika Beerappa, S/o. K.Shankaraiah, Aged 40 yrs., Occ: Agriculture, R/o. H.No. 2-7, M.P. Patelguda Village, Ibrahimpatnam Mandal, R.R. District (Sy.No. 239/E/2 ad